# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 05-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు రాష్ట్రంలో పర్యటిస్తారు.**

2. **రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా 99.25 శాతం మందికి పింఛన్లు అందించామని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ వెల్లడించారు.**

3. **మే 13న జరిగే పోలింగ్‌లో 11 రకాల గుర్తింపు కార్డులతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని విశాఖపట్నం జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి పేర్కొన్నారు.**

4. **ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని కృష్ణాజిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు తెలిపారు.**

5. **వేసవి రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు మండల రైల్వే అధికారి తెలిపారు.**

==========================

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, అనకాపల్లిల్లో జరిగే ఎన్నికల ప్రచార సభల్లో ఆయన పాల్గొననున్నారు. తొలుత రాజమహేంద్రవరం లోక్‌సభ పరిధిలోని వేమగిరిలో మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రధానమంత్రి మాట్లాడనున్నారు. అనంతరం సాయంకాలం 5 గంటల 40 నిమిషాలకు అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం సమీపంలో నిర్వహించనున్న సభలో ప్రసంగిస్తారు. ఈ సభలో ప్రధానమంత్రితో పాటు టీడీపీ, జనసేన అధ్యక్షులు, నారా చంద్రబాబునాయుడు, కె.పవన్‌కల్యాణ్ పాల్గొంటారు.

--------------------------

రాష్ట్రవ్యాప్తంగా 48 లక్షల 18 వేల 104 మంది పింఛను లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా నగదు జమ చేశామని, మరో 16 లక్షల 82 వేల 989 మందికి వారి ఇళ్ల వద్దే పింఛన్లు

పంపిణీ చేసినట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు విభాగాల్లో కలిపి మొత్తం 99.25 శాతం మందికి పింఛన్లు అందజేశారని తెలిపారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మే 13న జరిగే పోలింగ్‌లో 11 రకాల గుర్తింపు కార్డులతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని విశాఖపట్నం జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, బ్యాంకు లేదా తపాలా శాఖ జారీ చేసిన పాస్ పుస్తకం, పాస్‌పోర్టు, ఫొటోగ్రాఫ్ ఉన్న పింఛను డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జారీ చేసిన ఐడీ కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎంఎల్‌సీలకు జారీ చేసిన ప్రభుత్వ గుర్తింపు కార్డు, ప్రత్యేక వైకల్యాన్ని గుర్తించే కార్డు వంటి వాటిలో ఏ ఒక్కటైనా ఉపయోగించి ఎన్నికల్లో ఓటు వేయొచ్చని తెలిపారు.

---------------------------

ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల సన్నాహాలు చివరి దశకు చేరుకున్నాయి. రాష్ట్రంలోని పది నియోజకవర్గాలకు ఈనెల 7 వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ఎన్నికల ర్యాలీలలో ప్రసంగిస్తారు. రాష్ట్రంలోని ఇటావా, ధౌరాహ్రా నియోజకవర్గాల్లో జరిగే రాజకీయ ర్యాలీల్లో ప్రధానమంత్రి పాల్గొనడంతో పాటు, ఈరోజు సాయంకాలం అయోధ్యలో రోడ్ షో నిర్వహించనున్నారు. రోడ్‌షోకు ముందు బాల రాముణ్ణి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

---------------------------

ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో ఆన్‌లైన్ నమోదు ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని కృష్ణాజిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఇతర ఉన్నత విద్యను అభ్యసించిన వారు మెయిల్ ద్వారా ఆధార్ కార్డును ఉపయోగించి employment.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయవచ్చని అన్నారు. అదే విధంగా వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ అయిన 48 గంటల్లోపు ఎంప్లాయిమెంట్ కార్డు జారీ అవుతుందన్నారు. అలాగే జిల్లాలో జరిగే జాబ్ మేళాలు ఏ ప్రాంతాల్లో జరుగుతాయో, ఎన్ని కంపెనీలు పాల్గొంటాయనే సమాచారం కూడా తెలుసుకోవచ్చు అని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు మండల రైల్వే అధికారి తెలిపారు. ఈనెల 9న తిరుపతిలో బయలుదేరే ప్రత్యేక రైలు తెనాలి, గుంటూరు మీదుగా సికింద్రాబాద్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీన సికింద్రాబాద్‌లో బయలుదేరే ప్రత్యేక రైలు సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, బ్రహ్మపూర్ మీదుగా వెళ్తుందని, తిరుగు ప్రయాణంలో ఈ రైలు 11న బ్రహ్మపూర్ నుంచి గుంటూరు మీదుగా సికింద్రాబాద్ చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా భువనేశ్వర్ నుంచి లోకమాన్య తిలక్ టర్మినల్‌కు వెళ్లే ప్రత్యేక రైలు మే, జూన్ నెలల్లో ప్రతి బుధవారం భువనేశ్వర్‌లో ప్రారంభమై విజయవాడ, గుంటూరు మీదుగా లోకమాన్యతిలక్ టర్మినల్‌కు చేరుతుందని ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

---------------------------

ఈ నెల ఎనిమిదో తేదీన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయవాడ పర్యటన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ముందస్తు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ నేతృత్వంలో అధికారుల బృందం గన్నవరం విమానాశ్రయంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రధానమంత్రి పర్యటనలో భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అధికారులకు సూచనలు చేశారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల విధుల్లో, అత్యవసర సేవల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. భీమవరంలో నిన్న అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకొనేందుకు 15 వేల 477 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఇతర ప్రాంతాల్లో ఓటు వున్నవారు ప్రస్తుతం జిల్లాలోని ఏ నియోజకవర్గంలో పనిచేస్తున్నారో అక్కడే వారు ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈ నెల 6, 7వ తేదీలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.

---------------------------

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రతలో పనిచేసే భవన నిర్మాణ కార్మికులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అత్యవసర ఐస్‌ప్యాక్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పని ప్రదేశాల్లో సిద్ధంగా ఉంచుకోవాలని, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తరచూ తీసుకోవాలని తెలిపారు. వివిధ దుకాణాల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు ఎండ తీవ్రతను బట్టి పనివేళలు నిర్ణయించాలని దుకాణదారులకు సూచించారు.

---------------------------

మే నెలలో తిరుపతిలోని కోదండరామస్వామి వారి ఆలయంలో విశేష ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం-టిటిడి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. మే 11, 18, 25వ తేదీల్లో శ్రీ సీతారామ లక్ష్మణుల మూలవర్ల అభిషేకం, ఊంజల్‌సేవ, మే 8వ తేదీ సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహన సేవ నిర్వహిస్తారని టిటిడి ప్రకటనలో పేర్కొంది. 11వ తేదీన శ్రీ కోదండరామ స్వామివారి పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహిస్తారు. 12వ తేదీన కోదండరామ స్వామివారి పుష్పయాగం, మే 23వ తేదీ పౌర్ణమి నాడు ఆలయంలో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తారని టిటిడి తెలిపింది.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**......వాయిస్ 38 సెకన్లు.....**

---------------------------

రాఎన్నికల సిబ్బంది  పోస్టల్ బ్యాలెట్‌ను ఈ రోజు, రేపు వినియోగించుకోవాలని చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ కోరారు. పలు శాఖల అధికారులతో  దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈరోజు పీవో, ఏపీవో, ఓపీవో, ఎంవోలు, అంగన్‌వాడీలు, రేపు  అత్యవసర సర్వీసుల్లో పనిచేసేవారు.. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి సాయంకాలం 6 గంటల్లోగా ఫెసిలిటేషన్ కేంద్రాలకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని అన్నారు. ఇతర జిల్లాలో ఓటు హక్కు కల్గి, చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నవారు కలెక్టర్ కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

======================